క్లుప్తంగా

అర్ధగిరిలో శ్రీకాళహస్తి ట్రస్టు బోర్డు చైర్మన్



అర్ధగిరి క్షేత్రంలో అంజూరు తారక శ్రీనివాసులు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామిని గురువారం సాయంత్రం శ్రీకాళహస్తి దేవస్థానం ట్రస్టు బోర్డు చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తమ కుటుంబ సభ్యులతో దర్శించుకొన్నారు. ఆయనకు ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందాం



అవగాహన కల్పిస్తున్న కమిషనర్ రమేష్‌బాబు

శ్రీకాళహస్తి: పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందామని శ్రీకాళహస్తి పురపాలకసంఘ కమిషనర్ రమేష్‌బాబు అన్నారు. పట్టణంలోని కొండమిట్ట వాటర్ ట్యాంకు పరిసర ప్రాంతాల్లో గురువారం స్వచ్ఛతే హి సేవ కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ రమేష్‌బాబు మాట్లాడుతూ ఆరోగ్యంగా జీవించాలంటే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సచివాలయ పరిధిలో ఏఎన్ఎం, ఆశావర్కర్లు ప్రతి ఇంటి వద్ద ఫ్రైడే డ్రైడేపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు సాయి సింధు, శ్రీనివాసులు, బాలకృష్ణ, పారిశుధ్య కార్మికులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను బడిలో చేర్చండి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు

ఏర్పేడు: బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పాలని శ్రీకాళహస్తి ఆర్డీఓ రామారావు ఉపాధ్యాయులను ఆదేశించారు.మండలంలోని అముడూరు ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్డీఓ మాట్లాడుతూ గ్రామాల్లో బడిఈడు పిల్లలను గుర్తించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఆరేళ్ళ పైబడిన పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్చుకోవాలని స్పష్టం చేవారు. విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించాలని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు ఉన్నట్లు చెప్పారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

ఏర్పేడు: పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం కలుగుతుందని ప్రధానోపాధ్యాయురాలు భువనేశ్వరి అన్నారు. మండలంలోని గురువారం పాతవీరాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో స్వచ్ఛత హిసేవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సెప్టెంబరు 15 నుంచి అక్టోబరు 2 వరకు ఈ కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. గ్రామాల్లో మురుగునీటిని వీధులపైకి వదలకుండా కాలువలను ఉపయోగించాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేవరాజులు, పద్మజ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియాకి విద్యార్థిని ఎంపిక



ఎంపికైన విద్యార్థిని పూజిత

రేణిగుంట: ఖేలో ఇండియా జాతీయ స్థాయి క్రీడా పోటీలకు తమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని జి.పూజిత ఎంపికైనట్లు రేణిగుంట డాక్టర్ బషీర్స్ తపస్య స్కూల్ అధినేత విక్రమ్‌శాలీ గురువారం తెలిపారు. అమరావతిలోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మైదానంలో గురువారం జరిగిన జాతీయ స్థాయి ఎంపిక పోటీల్లో పూజిత అండర్–14 విభాగంలో 200 మీటర్ల పరుగుపందెం పోటీల్లో పాల్గొని కేవలం 28.1 సెకన్లలో పూర్తి చేసి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై నట్లు ఆయన తెలిపారు. అక్టోబర్‌లో జరగనున్న జాతీయ పోటీల్లో తమ విద్యార్థిని ప్రతిభ కనబరచి రేణిగుంటకు ఖ్యాతిని తీసుకొస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

బ్రహ్మాండం.. బ్రహ్మోత్సవం



వాహన సేవలో గజరాజుతో టీటీడీ ఈవో ఏవి ధర్మారెడ్డి



కల్పవృక్ష వాహన సేవలో కళాబృందాల ప్రదర్శన



ఆలయ మాడవీధుల్లో మజ్జిగ పంపిణీ చేస్తున్న అన్నమయ్య వంశీకులు

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో నాల్గవ రోజు గురువారం ఉదయం మలయప్పస్వామి కల్పవృక్ష వాహనంపై రాజమన్నార్ అలంకారంలో, రాత్రి సర్వభూపాలునిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. వాహనాల ముందు భక్తజన బృందాలు, భజనలు, కోలాటాల నడుమ వాహనసేవలు కోలాహలంగా జరిగాయి.



వాహన సేవలో తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి దంపతులు





సర్వభూపాలుని వాహన సేవలో కళాబృందాల సాంస్కృతిక ప్రదర్శనలు

శుక బ్రహ్మాశ్రమంలో ఘనంగా బలరామ జయంతి



హాజరైన రైతులు, నాయకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని శుకబ్రహ్మాశ్రమంలో భారతీయ కిసాన్ సంఘ తిరుపతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు సుబ్రహ్మణ్యం అధ్యక్షతన బలరామ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆర్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు నాగారెడ్డి హరికుమారరెడ్డి, భారతీయ కిసాన్ సంఘ జాతీయ కార్యవర్గ సభ్యులు జలగం కుమారస్వామి, బీకేఎస్ రాష్ట ఉపాధ్యక్షులు రాజారెడ్డి, శుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరి స్వామి హాజరయ్యారు. జలగం కుమారస్వామి మాట్లాడుతూ బలరామ జయంతిని రైతు దినోత్సవంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతులకు గౌరవం దక్కాలంటే రాజకీయాలకు అతీతంగా కలిసి ఉండాలన్నారు. అనంతరం అనుభవజ్ఞులైన రైతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి, తొట్టంబేడు, కేవీబీపురం మండలాల నుంచి రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): మండలంలోని తొట్టంబేడు ఎస్టీకాలనీలో పేకాడుతున్న వారిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు. ఆయన కథనం మేరకు గురువారం ఎస్టీ కాలనీలో పేకాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.1,850 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. మండలంలో అసాంఘిక కార్యాకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన తీవ్రంగా హెచ్చరించారు.

నవయుగ వైతాళికుడు గురజాడ

ఏర్పేడు: ఆధునిక మహిళల జీవితాన్ని తన రచనలతో మలుపు తిప్పిన నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు అని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఉమ అన్నారు. మండలంలోని పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం గురుజాడ అప్పారావు 161వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె మాట్లాడుతూ కన్యాశుల్కం, పుత్తడి బొమ్మ పూర్ణమ్మ, కన్యక కవితల ద్వారా మహిళల్లో చైతన్యం కల్గించినట్లు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీమన్నారాయణ, సువర్ణ, వెంకటసుబ్బమ్మ, సురేష్, రాఘవరెడ్డి, అమరేశ్వర రెడ్డి, శంకరప్ప, షమీర్ అహ్మద్, నారాయణరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా నివాళి

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో గురువారం గురజాడ అప్పారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా పనిచేస్తున్న నీరజను ఘనంగా సన్మానించారు. అనంతరం కళాశాల తెలుగు, ఆంగ్ల సమన్వయకర్త సంక్రాంతి రాజేంద్రుడు మాట్లాడుతూ గురజాడ గొప్పతనం, రచనలను వివరించారు. కన్యాశుల్కం నాటకాన్ని విశదీకరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మురళి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగుజాతికి వెలుగుజాడ గురజాడ

బుచ్చినాయుడుకండ్రిగ: అభ్యుదయ కవితా పితామహుడిగా ఆధునిక తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన నవయుగ వైతాళికులు, సంఘసంస్కర్త, తెలుగుజాతికి వెలుగుజాడ గురజాడ అప్పారావు అని అభ్యుదయ రచయితల సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు యువశ్రీమురళి కొనియాడారు. శుక్రవారం మండలంలోని కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు సురేష్ ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురజాడ చిత్రపటం వద్ద నివాళులు అర్పించి, పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురజాడ అప్పారావు రచనల ద్వారా మూఢనమ్మకాలను పారదోలి సమాజంలో నూతన చైతన్యానికి నాంది పలికిన అభ్యుదయవాది అని కొనియాడారు. అనంతరం ఆయన రాసిన "దేశమును ప్రేమించుమన్నా..మంచియన్నది పెంచుమన్న" దేశభక్తి గేయాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆలపించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళి, ప్రసాద్, వేణుగోపాల్, దేవేంద్ర, దాసు, మాధవీలత, తదితరులు పాల్గొన్నారు.



గురజాడ అప్పారావు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు



శ్రీకాళహస్తి: సమావేశంలో మాట్లాడుతున్న అధ్యాపకులు

గణనాథుని ఉత్సవాల్లో అన్నదానం



రేణిగుంటలో గణనాథుని దర్శించుకున్న సర్పంచ్ నగేషం, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్

రేణిగుంట: మండల కేంద్రంలోని పాంచాలినగర్ యూత్ ఆధ్వర్యంలో పాంచాలినగర్‌లో ఏర్పాటు చేసిన గణనాథుని గురువారం సర్పంచ్ నగేషం, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, ఎంపీటీసీ వెంకటసుబ్బమ్మ, వార్డు సభ్యుడు ఇరానీ ఖాదర్, రమణ దర్శించుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. పాంచాలినగర్ వినాయకుని వైఎస్సార్ సీపీ నాయకులు మన్యం శ్రీనివాసులురెడ్డి దర్శించుకున్నారు.

నాగార్జున యాదవ్‌కు సత్కారం



నాగార్జున యాదవ్‌తో వైఎస్సార్ సీపీ నాయకులు

ఏర్పేడు: ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషనల్ హెల్పర్ సొసైటీ డెవలప్‌మెంట్ చైర్మన్ నాగార్జున యాదవ్‌ను పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు సత్కరించారు. తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో గురువారం ఏర్పేడు మండల వైఎస్సార్ సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువలతో సన్మానించి తిరుమల వెంకటేశ్వర స్వామి ప్రసాదాలు అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఐతేపల్లి గురునాథం, కేశవులు రెడ్డి, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న జిల్లా స్టాండింగ్ కమిటీ మెంబరు, జెడ్పీటీసీ విజయలక్ష్మి

సత్యవేడు: తల్లీబిడ్డా ఆరోగ్యంగా ఉండాలన్న సంకల్పంతోనే ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తోందని జిల్లా స్టాండింగ్ కమిటీ మెంబరు, సత్యవేడు జెడ్పీటీసీ పి.విజయలక్ష్మి అన్నారు. గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలతో సీడీపీఓ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కే.చంద్రశేఖర్ రెడ్డి, మండల కన్వీనర్ కే.సుశీల్‌కుమార్ రెడ్డి, విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ అధికారి కాశీ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మన పెరట్లో పెంచుకునే తాజా కూరగాయలే పౌష్టికాహారమని, వాటిని నిర్లక్ష్యం చేయడంతో చాలామంది పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారని తెలిపారు. కూరగాయలు, ఆకుకూరల్లో సూక్ష్మపోషకాలైన విటమిన్లు, ఖనిజాలు లభిస్తాయన్నారు. వాటితోనే మెరుగైన ఆరోగ్యం లభిస్తుందన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మీ ఇళ్లకే అందించే పౌష్టికాహారాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలో 5 అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, సీడీపీఓ దేవకుమారి, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

బార్ కాదు.. క్రీడా మైదానమే..!



పాఠశాల ఆవరణలో ఉన్న ఖాళీ మద్యం సీసాలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానాన్ని మందుబాబులు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చుతున్నారు. పాఠశాల క్రీడా మైదానంలో మందుబాబులు రాత్రిళ్లు మద్యం సేవించి మందుబాబులు మద్యం సేవించి ఖాళీ మద్యం సీసాలు, వాటరు ప్యాకెట్లు, తినుబండారాలను అక్కడే వదిలి వెళ్తున్నారు. మందుబాటిళ్లను పగలకొట్టి పడేసి పోవడం వల్ల విద్యార్థుల కాళ్లకు గుచ్చుకునే ప్రమాదం ఉంది. దీనికితోడు విద్యార్థులు ఆటలు ఆడుకునేటప్పుడు కూడా ఇబ్బందిగా ఉంటోంది. పోలీసు అధికారులు స్పందించి పాఠశాల ఆవరణలో మందుబాబులు మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

గరుడోత్సవానికి ఆర్టీసీ సిద్ధం

- బ్రహ్మోత్సవాల్లోనూ సాధారణ చార్జీలే
- అప్ అండ్ డౌన్ టికెట్లకు రూ.20 తగ్గింపు

తిరుపతి అర్బన్: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఆర్టీసీ భాగస్వామ్యం కీలకం. శ్రీవారి దర్శనం కోసం వచ్చే లక్షలాది మంది భక్తులకు ఇబ్బందులు లేకుండా రవాణా సౌకర్యం కల్పించాల్సి ఉంది. ఈ క్రమంలో ఆర్టీసీ సర్వం సిద్ధం చేసింది. బ్రహ్మోత్సవాల సమయంలో చార్జీలకు సంబంధించి టికెట్ ధరలు పెంచుకునే వెసులుబాటు ఉంది. అయితే భక్తులను దృష్టిలో ఉంచుకుని సాధారణ చార్జీలతో ప్రత్యేక సర్వీసులను నడపాలని భావించారు. సాధారణ సర్వీసుల్లో పెద్దలకు టికెట్ ధర రూ.90, పిల్లలకు రూ.70, విద్యుత్ ఏసీ సర్వీసుల్లో పెద్దలకు రూ.110, పిల్లలకు రూ.90 చార్జీ ఉంది. అదే ధరతో భక్తులకు ఆర్టీసీ సర్వీసులను నడపనున్నారు. తిరుపతి నుంచి తిరుమల కొండకు వెళ్లే భక్తులు రాను, పోను టికెట్లు ఒకేసారి తీసుకుంటే రూ.20 తగ్గుతుంది.

గరుడోత్సవానికి ఆర్టీసీ సర్వీసులు ఇలా

గరుడోత్సవం సందర్భంగా ఉదయం నుంచి తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లోని ఏడుకొండల స్వామి బస్టాండ్, రైల్వేస్టేషన్, అలిపిరి బాలాజీ బస్టాండ్ నుంచి తిరుమలకు సర్వీసులను ఏర్పాటు చేశారు. అయితే శుక్రవారం రాత్రి 7గంటల తర్వాత అలిపిరి బాలాజీ బస్టాండ్ నుంచి మాత్రమే తిరుమలకు ఆర్టీసీ సర్వీసులను ఏర్పాటు చేశారు.

ప్రత్యేక సర్వీసులు

గరుడోత్సవం సందర్భంగా శుక్రవారం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. సాధారణంగా 220 సర్వీసులు రోజూ 1400 ట్రిప్పులు నగుపుతుంటారు. అయితే గరుడోత్సవం నేపథ్యంలో 340 సర్వీసులు 2,700 ట్రిప్పులు నడపనున్నారు.

వరసిద్ధునికి ముక్కంటి సారె



సారె తీసుకెళుతున్న ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు

శ్రీకాళహస్తి: కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామికి గురువారం శ్రీకాళహస్తీశ్వరాలయం తరఫున సారె సమర్పించారు. తొలుత ముక్కంటి ఆలయంలో పాలకమండలి, అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాణిపాకం చేరుకుని వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ ఆలయంలోకి ప్రవేశించారు. స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి విశేష పూజలు జరిపించారు. కాణిపాక ఆలయ కమిటీ చైర్మన్, అధికారులు వారికి స్వామివారి తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందజేశారు.

క్రీడల అభివృద్ధికి సర్కారు ప్రోత్సాహం





జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన బాలురు, బాలికలతో ఉపాధ్యాయులు, నిర్వాహకులు, వ్యాయామ ఉపాధ్యాయులు

సత్యవేడు: క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తోందని మండల కన్వీనర్ కే.సుశీల్ కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం సత్యవేడు బాలుర ఉన్నత పాఠశాలలో నియోజకవర్గస్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. ఇందులో జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలకు నియోజకవర్గస్థాయిలో 120 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. ప్రభుత్వ ఉన్న పాఠశాల హెచ్ఎం భారతి, పీడీ మురళితో కలసి ఆయన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులకు మానసిక ఉల్లాసంతో పాటు శరీరానికి మంచి వ్యాయామాన్ని ఇస్తాయన్నారు. విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణించాలన్నారు. అనంతరం బాలుర ఉన్నత పాఠశాల పీడీ క్రీడాపోటీలను పర్యవేక్షించారు. 12 మంది వ్యాయామ ఉపాధ్యాయులు స్పోర్ట్స్ ఈవెంట్స్ నిర్వహించారు. పరుగుపందెం, లాంగ్‌జంప్, హైజంప్, జావెలిన్ త్రో, బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. సత్యవేడు, నాగలాపురం, పిచ్చాటూరు, నారాయణవనం, వరదయ్యపాళెం, బుచ్చినాయుడుకండ్రిగ, కేవీబీపురం మండలాల నుంచి అండర్–14, అండర్–17 విభాగంలో బాలబాలికలు 120 మంది పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను నియోజవర్గస్థాయిలో గుర్తించి జిల్లాస్థాయికి ఎంపిక చేశారు. జిల్లాస్థాయిలో రాణించేలా తర్ఫీదు ఇవ్వనున్నట్లు పీడీలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్, సత్యవేడు నోడల్ పీడీ బి.కుమార్, పీడీలు ముద్దుకృష్ణ, లోకనాథం, రాజ, స్వర్ణ, డిల్లీరాణి, నాగరాజు, మహేష్‌బాబు, అపర్ణ, సతీష్, కరాటే మాస్టర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితి సంబరాల్లో అన్నదానం

ఏర్పేడు: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఏర్పేడులో భక్తులకు అన్నదానం చేశారు. రాక్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం వినాయక స్వామి విగ్రహానికి విశేషాలంకరణ చేసి పూజలు చేశారు. మధ్యాహ్నం 600 మంది భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య, మాజీ సర్పంచ్ గోవిందరెడ్డి, బాలాజీ, సుబ్రమణ్యంరెడ్డి, భాస్కర్, నరేష్, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న శివయ్య